

## 25న తపాలా అదాలత్

బెలగాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పోస్టల్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం సూపరింటెండెంట్ బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్ ఆధ్వర్యంలో అదాలత్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. తపాలా సర్వీసులకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదులు చేయొచ్చన్నారు. వాటిపై చర్చించి పరిష్కారం చూపుతారని వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని వారు ఈ నెల 22లోపు విశాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయానికి ఫిర్యాదులు పంపించాలని కోరారు.


# సమస్యలు ఇవిగో!

- చొరవ చూపాలి.. పురోగతి సాధించాలి
- జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి
- నేడు కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



నూతన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. మౌలిక వసతులపై మాత్రం దృష్టి సారించలేదు. ఫలితంగా నేటికీ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పార్వతీపురం కేంద్రంగా ఏర్పాటైన మన్యం జిల్లా అయితే అనేక సమస్యలతో సతమతమవుతోంది. ప్రధానంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అన్ని శాఖలకు పూర్తిస్థాయిలో అధికారులు లేరు. ఇతర జిల్లాలకు చెందిన వారు ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. దీంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. కాగా నేడు విధుల్లో చేరనున్న కొత్త కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. సమస్యల పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లాకు మూడో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఆయన అందరి సహకారంతో మన్యాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని జిల్లావాసులు ఆశిస్తున్నారు.




ఇదీ పరిస్థితి

- జపాన్ నిధులతో జిల్లాలో వీఆర్ఎస్, పెద్దగెడ్డ రిజర్వాయర్, పెదంకలం సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాల్సి ఉంది. పార్వతీపురం-మక్కువ మండలాల్లో మధ్యలో నిలిచిపోయిన అడారుగెడ్డ తదితర రిజర్వాయర్ల నిర్మాణాలు, చెరువుల అభివృద్ధిపైనా శ్రద్ధ వహించాల్సి ఉంది. జంఝావతి సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశాతో ఉన్న వివాదం కొలిక్కి తెచ్చి.. శివారు ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలి.
- జిల్లా కేంద్రం పార్వతీపురంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు సాలూరు పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు జరిగేలా చూడాలి.
- కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి మోక్షం కల్పించాలి.
- సీతంపేట, పార్వతీపురంలో మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు, సాలూరు, కురుపాం తదితర ఆసుపత్రుల పనులు వేగవంతంగా పూర్తి చేస్తే ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందే అవకాశం ఉంది. జిల్లా కేంద్రాసుపత్రితో పాటు పాలకొండ, సీతంపేట, సాలూరు ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించాలి.
- ఐటీడీఏల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. మూడు గర్భిణుల వసతిగృహాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందించాలి. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి.. 12 గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చూడాలి. ఏజెన్సీలో విద్యాభివృద్ధికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.
- జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు స్థానికంగా ఉపాధి కల్పించాలి.
- గిరిజనుల గోడును పరిగణనలోకి తీసుకుని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉన్న

(మిగతా 8వ పేజీలో...)

## అదృష్టంగా భావిస్తున్నా..

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో కలెక్టర్‌గా పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని బదిలీపై సత్యసాయి జిల్లాకు వెళ్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లా రెండో కలెక్టర్‌గా పనిచేసినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత గిరిజనుల అభిమానాన్ని మరువలేనని తెలిపారు. అనంతరం ఆయన్ని జిల్లా అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

### మార్పులకు శ్రీకారం..

'కంటైనర్ ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, వసతిగృహాలు, పాఠశాలల్లో మార్పులు, జీడి ప్రోసెసింగ్ యూనిట్, ఎనీమియా కమిటీలు, బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు, గిరిజన గ్రామాలకు రహదారులు, సెల్ టవర్ల ఏర్పాటు, టెన్త్‌లో వరుసగా మూడోసారి జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుంది. పీజీఆర్ఎస్ ద్వారా అర్జీదారులు, రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అందరి మదిలో నిలిచారు.' అని పలువురు జిల్లా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, ఏఎస్పీ అంకితా సురాన, సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.




వీడ్కోలు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

## గంజాయి నిర్మూలనకు స్పష్టమైన కార్యాచరణ

- రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి


విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీలో పూర్తిగా గంజాయి నిర్మూలనపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలుచేయాలని రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. శుక్రవారం రేంజ్ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు 14 మంది నిందితుల నుంచి రూ.10.04 కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇంకా 1,119 మంది గంజాయి నిందితులపై షీట్లు తెరవడం, 51 మందిపై పీడీ యాక్టు, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుచేయడానికి ప్రతిపాదించామన్నారు. తరచుగా గంజాయి రవాణాచేసే 368 మంది, ఇతర నేరాలతో సంబంధం ఉన్న 370 మందిని గుర్తించామన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల ఆధారంగా 341 మందిని అరెస్టు చేఉసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయని, వీరిలో 24 మందికి 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. రేంజ్ పరిధిలో టెక్నాలజీ వినియోగించి పరారీలో ఉన్న నిందితుల్ని పట్టుకున్న అధికారులను అభినందించారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా గంజాయి రవాణా మార్గాలను అధ్యయనంచేసి అరికట్టే వ్యూహం రూపొందించాలని డీఐజీ సూచించారు. స్త్రీలు, చిన్నపిల్లలపై లైంగిక నేరాలు, తప్పిపోయిన మహిళలు, బాలికల కేసులపై వేగవంతంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు అధిగమించడానికి కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలన్నారు. సమీక్షలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్ జిందాల్, తుహిన్ సిన్హా, అమిత్‌బర్గర్ పాల్గొన్నారు.




రేంజ్ ఎస్పీలతో సమీక్షిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

## బడులకు కొత్త మాస్టార్లు!

- తుది అంకానికి మెగా డీఎస్సీ
- వారం రోజుల్లో ఎంపిక జాబితా వెల్లడి
- దసరా సెలవుల తరువాత విధుల్లో చేరే అవకాశం



సాలూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యా యుల జాబితా వారం రోజుల్లో వెల్లడయ్యే అవకాశం ఉంది. దసరా సెలవుల తర్వాత వారు విధుల్లో చేరనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో వివిధ మేనేజ్ మెంట్, కేడర్లలో 583 పోస్టుల భర్తీకి ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీలు 210, పాఠశాల సహాయకులు క్యాడర్‌లో తెలుగులో 14, హిందీలో 14, ఆంగ్లంలో 23, గణితంలో 8, భౌతికశాస్త్రంలో 32, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 62, పీఈటీ 63 మొత్తం 446 టీచర్ ఖాళీలు చూపించారు. ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీలు 60 పాఠశాల సహాయకుల క్యాడర్‌లో ఆంగ్లంలో 7, గణితంలో 25, భౌతిక శాస్త్రంలో 24, జీవశాస్త్రంలో 16,సాంఘిక శాస్త్రంలో 5 మొత్తం 137 టీచర్ పోస్టులు ఖాళీలను చూపించారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు విజయనగరంలో పరీక్షలు నిర్వహించారు. మెరిట్ జాబితాలను గత నెలలో ప్రకటించారు. ఆగస్టు 11న వ్యక్తిగత స్కోర్ వివరాలు వెల్లడించారు. కాగా అదే నెల 23న 7,725 మందితో ఎజ్జీటీ మెరిట్ జాబితా ప్రకటించారు. పాఠశాల సహాయకుల కేటగిరీలో ఆంగ్లానికి 665 మంది, గణితంలో 1497 మంది, ఫిజికల్ సైన్స్‌లో 1398 మంది, సోషల్‌లో 2618 మంది, తెలుగు 885 మంది, బయాలజీ 1359 మందితో మెరిట్ జాబితాలను ప్రకటించారు. వీటి భర్తీ కోసం ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రకటించిన మెరిట్ లిస్ట్ నుంచి రిజర్వేషన్, నియమ నిబంధ నలకు అనుగుణంగా గత నెల 26 నుంచి 28 వరకు డెంకాడ మండలం మోదవలసలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. కాగా పోస్టులకు ఎంపికైన వారి జాబితాలను వారం రోజుల్లో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అమరావతిలో సభ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు అందించే అవకాశముంది.

## తెన్నుఖర్జలో కింగ్ కోబ్రా



కురుపాం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న తెన్నుఖర్జ గిరిజన గ్రామంలో శుక్రవారం కింగ్ కోబ్రా హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు హడలిపోయారు. సుమారు 12 అడుగులున్న ఆ విష సర్పం గ్రామానికి చెందిన తిమ్మిక సోమందొర ఇంట్లో చేరింది. ఓ మూలన నక్కి ఉన్న దానిని చూసి అక్కడున్న వారు తీవ్ర భయాందోళన చెందారు. వెంటనే గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి గంగరాజు తన సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఆ పాము అక్కడి నుంచి వెళ్లిపోయింది. కాగా మళ్లీ ఆ విష సర్పం ఎక్కడ తిరిగొస్తుందోనని తెన్నుఖర్జ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఇదే మండలం కిచ్చాడలో, కొద్ది రోజుల కిందట సీతంపేటలోని జనావాసాల్లోకి కింగ్ కోబ్రా వచ్చిన విషయం తెలిసిందే. వాటివల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంప్‌లు

- సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

8లో

## కాజ్‌వేపై వరదనీరు



- పొట్లి, నవగాం గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

8లో



స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

## నాగావళిలో పెరిగిన వరద

గరుగుబిల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళిలో శుక్రవారం వరద ప్రవాహం పెరిగింది. ఒడిశాతో పాటు జిల్లాలోనూ వర్షాలు కురుస్తుండడంతో 6500 క్యూసెక్కులు నదిలో చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి 5 వేల క్యూసెక్కులను దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. సాగునీటి అవసరాల కోసం ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కులను సరఫరా చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.51 మీటర్ల మేర నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## సక్రమంగా యూరియా సరఫరా

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జేసీ

వీరఘట్టం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం వీరఘట్టం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. శ్లాట్ బుకింగ్ విధానం, ఎరువుల పంపిణీ ప్రక్రియ పరిశీలించారు. ఎరువుల కోసం రైతులు వేచి ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లాలో అన్నదాతలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా కలెక్టరేట్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ సాయి కామేశ్వర రావు, ఏవో సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

## పైడితల్లి పండుగకు అంకురార్పణ

- ఘనంగా పందిరిరాట
- భక్తుల దీక్షలు ప్రారంభం

6లో

## ఆటల పండుగ మొదలాయే!

6లో

## ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే జయకృష్ణ

6లో




## వసతుల కొరత చదువులకు అవస్థ

- అధ్వానంగా ఇంటిగ్రేటెడ్ వసతి గృహం
- కొరవడిన తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు
- పాడైన గచ్చులు.. ప్రమాదకరంగా విద్యుత్ బోర్డులు
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఇంటిబాటపడుతున్న విద్యార్థులు



ఇంటిగ్రేటెడ్ హాస్టల్

జియ్యమ్మవలస, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం చినమేరంగి ఇంటిగ్రేటెడ్ బీసీ వసతి గృహం పరిస్థితి దయనీయంగా మారింది. గదులు అధ్వానంగా మారగా.. తాగునీటి, మరుగుదొడ్ల సదుపాయాలు కొరవడ్డాయి. పూర్తిగా పాడైన గచ్చులు, భద్రత లేని విద్యుత్ బోర్డులు.. కంపుకొడుతున్న పరిసరాల మధ్య విద్యార్థులు చదువులు కొనసాగించాల్సి వస్తోంది. సరైన వసతి సౌకర్యం లేని కారణంగా దీనికి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఈ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి. వాటిని చదివేందుకు ఏటా విద్యార్థులు అధిక సంఖ్యలో కౌన్సిలింగ్‌కు హాజరవుతుంటారు. కానీ ఇక్కడ కనీస వసతి సౌకర్యాలు లేక తిరిగి వెళ్లిపోతున్నారు. వాస్తవంగా ఒక్కో గ్రూపులో 60 మంది చొప్పున 540 మంది ఈ కళాశాలలో ఉండాలి. కానీ 2025-26లో 63 మంది ఇక్కడకు రాగా.. 50 మంది తిరిగి వెళ్లిపోయారు. ప్రస్తుత విద్యా సంవత్స రానికి ఈ పాలిటెక్నిక్

(మిగతా 8వ పేజీలో...)

### రూ.18.40 లక్షలతో అంచనా

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో వసతుల కల్పనకు రూ.18.40 లక్షలు అవసరమని బీసీ సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేసి కలెక్టర్‌కు నివేదించారు. త్వరలో నిధులు మంజూరవుతాయని వారు ఆశిస్తున్నారు.

## ప్రథమ స్పందనే కీలకం

- అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సతో మేలు
- తొలి గంట సమయానికి అత్యంత ప్రాధాన్యం
- ఆలోగా వైద్య సేవలందితే ప్రాణాలకు రక్షణ
- నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినం

6లో



# ఆటల పండుగ మొదలాయే!

● ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



నెల్లిమర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి దశ నుంచే బాలబాలికలు క్రీడలపై దృష్టి సారించేందుకు వీలుగా ఏటా ఎస్‌జీఎఫ్ (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదికి సంబంధించి మండల స్థాయిలో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం.. ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేయడం ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం.

**మూడంచెల పద్ధతిలో..**

స్కూల్ గేమ్స్‌కు సంబంధించి మొత్తం 50 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-14, 17 విభాగాల్లో పాఠశాల, అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో విడతల వారీగా నిర్వహిస్తారు. వీటిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాలలో మూడంచెలుగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఏడు క్రీడాంశాలకు సంబంధించి ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారు. మిగిలిన క్రీడాంశాలకు సంబంధించి నేరుగా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో క్రీడాంశంలో ఒక్కో జట్టును ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై క్రీడల్లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. వాటితో వివిధ ఉద్యోగాలకు క్రీడా కోటా కింద 2 శాతం రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

**ఈసారీ దాతల పైనే..**

పోటీల నిర్వహణకు ప్రభుత్వపరంగా కొంత మేరకే సహకారం అందుతోంది. ఎప్పటిలాగానే దాతల సహకారం తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అంతేకాకుండా పోటీల నిర్వహణకు ఎటువంటి కార్యాచరణ చేపట్టకుండా నేరుగా షెడ్యూల్‌ను ప్రకటించడం గమనార్హం. వాస్తవానికి ఏటా జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలతో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పోటీల నిర్వహణకు వారి సహకారం కోరుతుంటారు. వారికి దిశా నిర్దేశం చేస్తుంటారు. ఈ ఏడాది అటువంటి సమావేశాలు నిర్వహించకుండానే పోటీలను ప్రారంభించారు. ఇది విమర్శలకు తావిస్తోంది. సరైన మార్గదర్శకాలు లేకుండానే నిర్వహించడం వల్ల క్రీడాకారుల ఎంపికలో పారదర్శకత కొరవడే అవకాశం ఉంటుందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

**విభాగాలు ఇలా..**

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 కేటగిరీల్లో వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-11, 14, 17 విభాగాల్లో కేవలం స్కేటింగ్ క్రీడాంశంలో మాత్రమే పోటీలు నిర్వహించనున్నారు.

# పైడితల్లి పండుగకు అంకురార్పణ

● ఘనంగా పందిరిరాట ● భక్తుల దీక్షలు ప్రారంభం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భక్తుల జయజయధ్వానాలు.. మేళతాళాలు.. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి పండుగకు అంకురార్పణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి ఎదుట ఉత్సవాలకు ప్రారంభ సూచికగా పందిరిరాటలు వేశారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈవో కె.శిరీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఆలయ పూజారి వెంకటరావులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పందిరిరాటతో సిరిమానోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

**దీక్షలు ప్రారంభం..**

మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో పైడితల్లి భక్తులు శుక్రవారం ఉదయం దీక్షలు ప్రారంభించారు. ప్రస్తుతం 50 మంది భక్తులు మాలధారణ చేశారు. ఎక్కువ మంది భక్తులు అర్ధమండల దీక్షలు చేపట్టనున్నారు. సిరిమానోత్సవం, ఉయ్యాల కంబాల అనంతరం జరిగే చండీహోమం వరకూ వీరి దీక్షను కొనసాగిస్తారు. చండీహోమం అనంతరం పైడిమాంబకు ప్రత్యేక పూజలు చేసి.. దీక్షలు విరమిస్తారు. వీరి ఆధ్వర్యంలో ప్రతి రోజు ఘటాల ఊరేగింపు, చండీహోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**రూ.1.80 కోట్లతో అభివృద్ధి పనులు**

పైడితల్లి ఆలయ విస్తరణ, ఇతర అభివృద్ధి పనులను సిరిమానోత్సవం ముగిసిన వెంటనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు విలేకరులకు చెప్పారు. చండీహోమం అనంతరం ప్రారంభించే ఈ పనులు వచ్చే ఏడాది సిరిమానోత్సవం ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. తొలి విడతగా రూ.కోటి 80 లక్షలతో పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు సూచనల మేరకు ఈ ఏడాది కూడా భక్తులకు తక్కువ సమయంలో పైడిమాంబని దర్శించుకునేందుకు ఉచిత క్యూలైన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే అదితి చెప్పారు.





# భారీ వర్షం.. రైతుల హర్షం

విజయనగరంలో కురుస్తున్న వర్షం

విజయనగరం/భోగాపురం/గంట్యాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ నిపుణుల ప్రకటనతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉదయం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరుగా ఎండ ఉంది. ఉదయం 10.35 గంటల తరువాత క్రమంగా వాతావరణం మారింది. భారీ వర్షం కురిసింది. తాజాగా కురిసిన వర్షాలు పంటలకు ఎంతో మేలు చేస్తాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు వర్షం ఎంతగానో ఉపయోగపడనుంది. జిల్లా కేంద్రమైన విజయనగరంలో భారీ వర్షం కురవడంతో ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఫుట్‌పాత్ వ్యాపారాలు మూసివేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపైకి వచ్చింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. గంట్యాడలో శుక్రవారం మధ్యాహ్నం 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వసంత, రామవరం, గెడ్డలు పొంగిపొర్లాయి. భోగాపురంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ నీటితో నిండి పోయింది. అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తహసీల్దారు కార్యాలయం, పోలీసుస్టేషన్, తదితర కార్యాలయాల్లో చీకట్లు అలముకున్నాయి. సంబంధిత సిబ్బంది సెల్‌ఫోన్ల వెలుతురులో విధులు నిర్వహించారు.





భోగాపురం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వర్షపునీరు

**ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు..**

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉంది. మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు తదితర గ్రామాల మత్స్యకారులు బోట్లను తీరంలో నిలిపివేశారు.

# ఉత్సవాలను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే జయకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయ ఆవరణలో శుక్రవారం దసరా ఉత్సవాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, తదితర శాఖలు సమన్వయంతో ఉత్సవాలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పారిశుధ్యం, ప్రథమ చికిత్సా కేంద్రాలు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలన్నారు. భక్తులకు రోజూ మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్ల ఏర్పాటు, ముగ్గురాటలు, ఘటాలు చెల్లించే వారికి, వీఐపీ, వీవీఐపీల క్యూలైన్లపై చర్చించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్ల లక్ష్మీప్రసాదశర్మ, ఈవో వి.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది భిన్నంగా 11 రోజుల పాటు దసరా ఉత్సవాలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. తొలిరోజు నిజరూప దర్శనం, దసరా రోజు భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

**రాష్ట్ర పండుగగా గుర్తించాలని...**

కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఇప్పటికే దీనిపై తాను ఉన్నతాధికారులకు నివేదించానని తెలిపారు. దీనిని మరింత ముందుకు నడిపించేందుకు చొరవ చూపాలని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్‌కు సూచించారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ తాను కూడా ఉన్నతాధికారులతో మాట్లాడి రాష్ట్ర పండుగగా గుర్తించేలా చూస్తానన్నారు. మరో రూ.2 కోట్ల మంజూరుకు ప్రతిపాదించామని ఈవో చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు, డీఎస్పీ రాంబాబు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిరంజీవి, టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, కర్నేన అప్పలనాయుడు, పడాల భూదేవి, గంటా సంతోష్‌కుమార్, గండి రామినాయుడు, తేజోవతి, కర్నేన యోగిత, కొండదాడి రాజేష్, కనపాక చౌదరినాయుడు, జాడ శ్రీధర్, ఎంపీపీ బొమ్మాళి భాను, సుధాకర్, వెన్నపు శ్రీనివాసరావు, గర్భాన సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పాట్లు పరిశీలన..**

కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం డీఎస్పీ ఎం.రాంబాబు, ఎస్ఐ ప్రయోగమూర్తి, ఆలయ ఈవో వి.వి. సూర్యనారాయణ పరిశీలించారు. క్యూలైన్ల ఏర్పాటుపై డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు రెండు స్టేజీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు, ఆర్టీసీ ఈయూ నాయకులు బి.కె.మూర్తి తదితరులు ఉన్నారు.



# భూమికి పచ్చని రంగేసినట్టు

సాలూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూమికి పచ్చని రంగేసినట్టు.. పచ్చదనమంతా అక్కడే ఉన్నట్టు.. సుందర దృశ్యం కనువిందు చేసింది. సాలూరు మండలం జీగిరాం సమీపంలోని పొలాలు ఇలా ఆహ్లాదంగా కనిపించాయి.

# ప్రథమ స్పందనే కీలకం

● అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సతో మేలు
● తొలి గంట సమయానికి అత్యంత ప్రాధాన్యం
● ఆలోగా వైద్య సేవలందితే ప్రాణాలకు రక్షణ
● ఇప్పటికీ దీనిపై అవగాహన కరువు
● నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినం



● రాజాం పట్టణానికి చెందిన శ్రీనివాసరావు, పద్మ దంపతులు టీవీ చూస్తున్నారు. ఆ సమయంలో కుమార్తె శ్రావ్య కూరగాయలు తురుముతున్న క్రమంలో చేతికి గాయమైంది. రక్తం కారుతుండడంతో తల్లిదండ్రులు కప్‌బోర్డులో ఉన్న ప్రథమ చికిత్స పెట్టెను తీసుకొచ్చారు. గాయానికి కట్టుకట్టి ఉపశమనం కలిగించారు. తరువాత ఆస్పత్రికి తీసుకెళ్లి టీటీ ఇంజక్షన్ వేయించారు. రెండు మూడు రోజులకు గాయం తగ్గింది.

● వంగర మండలం కొప్పర కొత్తవలసకు చెందిన ఓ రైతు పొలంలో దున్నుతుండగా కాలికి చిన్నపాటి ఇనుప మేకు గుచ్చుకుంది. రక్తస్రావం కావడం ప్రారంభించింది. దీంతో ఆ రైతు పసరు మందువేసి వస్త్రంతో గట్టిగా కట్టేశాడు. మూడు రోజుల తరువాత ఆ గాయం తీవ్రమైంది. పెద్దదిగా మారిపో యింది. దీంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రథమ చికిత్స చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో ఆ గాయం పెద్దదైంది. ఇన్‌ఫెక్షన్ సోకడంతో కొద్దిరోజుల పాటు ఆస్పత్రిలో ఉంచి వైద్యసేవలందించారు.

● రాజాం పట్టణానికి పనుల నిమిత్తం పాలకొండకు చెందిన వ్యక్తి బైక్‌పై వచ్చాడు . దారిలో మూర్ఛకు గురై కింద పడిపోయాడు. వెంటనే అటువైపుగా వెళుతున్న వారు సపర్యలు చేశారు. ప్రథమ చికిత్స అందించారు. ఆయన కోలుకున్న తరువాత ఆస్పత్రిలో చేర్పించారు.

రాజాం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి)

ప్రమాదం జరిగిన తరువాత నిపుణుల వైద్యం అందేలోగా 'ప్రథమ చికిత్స' చాలా కీలకం. అలా సరైన సమయంలో ప్రథమ చికిత్స అందక చాలామంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇప్పుడు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇక వీటిపై కావాల్సింది అవగాహన మాత్రమే. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుంటే చాలా మంచిది. ఇటీవల దీనికి బహుళ ప్రాచుర్యం కల్పిస్తున్నారు.

**● అంబులెన్స్ కోసం వేచి ఉండకుండా..**

ప్రమాదం జరిగినా.. ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తినా ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు సంఘటన జరిగిన గంటలోగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. దానినే 'గోల్డెన్ అవర్' అంటారు. ఆ సమయంలో ఆస్పత్రికి తీసుకొచ్చే వారికి సరైన వైద్యసేవలు అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు చెబుతున్నారు. మన కంటి ముందు ప్రమాదం జరిగితే క్షతగాత్రులను చూసి 108కి ఫోన్ చేస్తాం. వాహనం వచ్చే వరకూ వేచిచూస్తాం. కానీ గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చన్న ఆలోచన చాలా మంది చేయరు. ఇది మంచి పద్ధతి కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏబీసీ విధానంలో ప్రథమ చికిత్స అందించాలని సూచిస్తున్నారు. ఎయిర్, బ్రీతింగ్, సర్క్యులేషన్ (ఏబీసీ) విధానంతో రోగి/క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. ముఖ్యంగా గుండెపోటుతో శ్వాస అందని వారికి ఇలా ఏబీసీ విధానంలో సీపీఆర్ చేసి ప్రాణాలను నిలబెట్టవచ్చు.

**● పాము, కుక్కకాట్ల సమయంలో..**

జిల్లా ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. పొలాలకు వెళ్లేవారికి పాముకాట్లు వేస్తుంటాయి. ఆ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీరికి ప్రథమ చికిత్స కీలకం. పాముకాటు వేసిన శరీరభాగాన్ని సబ్బు నీరు లేదా యాంటీ సెప్టిక్ లోషన్‌తో శుభ్రం చేయాలి. నొప్పి తగ్గేందు కు ఎలాంటి మందులు వాడకూడదు. పాముకాటు వేసిన చోట కొద్దిసేపు ఐస్ ముక్క ఉంచడం ఉత్తమం. పాము కాటు వేసిన భాగంపైన వస్త్రంతో కానీ.. తాడుతో కానీ గట్టి గా కట్టాలి. 15 నిమిషాలకు ఒకసారి వదులు చేస్తుండాలి. సాధ్యమైనంత త్వరగా బాధితుడిని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. కుక్క కరిచినా అవే జాగ్రత్తలు తీసుకోవాలి. వెంటనే ఆ భాగాన్ని సబ్బునీటితో కడగాలి. గోరువెచ్చని నీటిని పది నిమిషాల పాటు గాయంపై పోయాలి. రక్తం కారకుండా తుడవాలి. స్టెరైల్ బ్యాండేజీని గాయం చుట్టూ చుట్టాలి. వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.

**● కిట్లలో ఇవి 'కీ'లకం**

ప్రథమచికిత్స కిట్లు ప్రతి ఇంటా ఉంచుకోవడం చాలా ఉత్తమం. ఇప్పుడు రకరకాలైన కిట్లు అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా ఆ కిట్లలో యాస్పిరిన్, డిస్పోజబుల్ నాన్ లెటెక్స్ గ్లవ్స్, శానిటైజర్, యాంటీ సెప్టిక్ వైప్, ఆయింట్‌మెంట్, వాటర్‌ప్రూఫ్ ప్లాస్టర్, బ్యాండేజీ, ఇన్‌స్టంట్ ఐస్ బ్యాగులు, కత్తెర, సీపీఆర్ ఫేస్ షీల్డ్, బర్న్ హైడ్రోజెల్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. పొలాలు, వాహనాలు, పాఠశాలలు, కాలేజీలు, అపార్ట్‌మెంట్లు, మాల్స్ రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో ప్రథమ చికిత్స బాక్సులు తప్పనిసరి చేయాలి. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సీపీఆర్‌పై అవగాహన కల్పించాలి. ప్రత్యేక శిక్షణనిచ్చి అలవాటు చేయాలి.

**● ఇది తెలుసా?**

ప్రమాదాలు జరిగే సమయంలో మొదటి గంటలో ఆస్పత్రికి తీసుకొచ్చే వారి సేవలను 'గుడ్ సమారిటన్' పేరిట కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తుంది. 2021 నుంచి ఏటా బహుమతులను సైతం అందిస్తోంది. ప్రజల్లో బాధ్యతను పెంచాలన్న ఉద్దేశంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకొచ్చే వారికి నగదు ప్రోత్సహకాలు అందిస్తున్నారు. మన జిల్లాలో సైతం రహదారి భద్రతా వారోత్సవాల సమయంలో ఇలాంటి వారిని ఎంపిక చేసి రవాణా శాఖ అధికారులు ప్రోత్సాహకాలను అందించారు.

**● అపర సంజీవిని..**

ప్రథమ చికిత్స అనేది ప్రమాదంలో ఉన్నవారికి అపర సంజీవిని. ఆస్పత్రికి తీసుకొచ్చేలోగా ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలను నిలపవచ్చు. ప్రమాదం జరిగినప్పుడు, అనారోగ్యానికి గురైనప్పుడు తొలిగంట గోల్డెన్ అవర్. ఆ సమయంలో ఎంతటి సంక్లిష్ట పరిస్థితినైనా ప్రథమ చికిత్స ద్వారా ఎదుర్కొనవచ్చు. అందుకే ప్రతి ఒక్కరికీ ప్రథమ చికిత్సపై అవగాహన పెరగాలి. ప్రతి ఇంట్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

-కరణం హరిబాబు, వైద్యుడు, రాజాం

# తొట్టెలు ఇలా.. పశువులు నీరు తాగేదెలా?

● పట్టించుకోని సిబ్బంది ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

ఎస్.కోట రూరల్/ జామి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మీరు చూస్తున్నవి రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మూగజీవాల దాహం తీర్చేందుకు ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు. ఒక్కో తొట్టె విలువ రూ.30వేలు. ప్రభుత్వం చెప్పిన వెంటనే సంబంధిత శాఖ పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు నిర్మించారు. బిల్లులు కూడా చేసుకున్నారు. అయితే తొట్టె ఉన్నా అందులో నీరు లేకపోవడం వల్ల పశువుల దాహం తీరడం లేదు. ఎస్.కోట మండలం తిమిడి పంచాయతీలో గల పశువుల తొట్టెలో నీరు అధ్వానంగా దర్శనమిస్తోంది. వీటిని నిర్వహించాల్సిన సిబ్బంది ఇది తమ పని కాదన్నట్లు వదిలేయడంతో వీటి దుస్థితి ఇలా తయారయ్యింది.


జామి పశువుల ఆసుపత్రి వద్ద నీరు లేని తొట్టె


తిమిడి వద్ద నీటి తొట్టెలో చెప్పులు చూపిస్తున్న రైతు

## నేడు మెగా లోక్ అదాలత్

గజపతినగరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యూడీషియల్ ముస్సిఫ్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కక్షిదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్‌గా జీఎస్ నాయుడు

శృంగవరపుకోట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పీఏసీఎస్ ఛైర్మన్‌గా తిమిడి గ్రామానికి చెందిన గొర్రిపాటి సింహాచలం నాయుడు (జీఎస్‌నాయుడు) నియమితులయ్యారు. సభ్యులుగా గేదెల శ్రీను, వబ్బిన గౌరీశ్వరీలకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పల రామప్రసాద్‌కు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆమె చూపు సజీవం

చీపురుపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కొత్తకోట సరస్వతి తన నేత్రాలను దానం చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె గురువారం రాత్రి మరణించారు. ఆమె కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రెడ్‌క్రాస్ టెక్నీషియన్లు రమణ, సుధాకర్‌లు కార్నియాను సేకరించి, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. రెడ్‌క్రాస్ డివిజన్ సమన్వయకర్త బీవీ గోవిందరాజులు, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు సరస్వతి కుటుంబ సభ్యుల్ని అభినందించారు.

## అందుబాటులో వ్యాక్సిన్లు

రాజాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు, బాలింతలకు, అప్పుడే పుట్టిన పిల్లలకు అవసరమైన రోటీన్ ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లు రాజాం పట్టణ పీహెచ్‌సీలో అందుబాటులోకి వచ్చాయని ఆదర్శనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఉంగ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వీటి కోసం ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఫార్మాసిస్టులను సంప్రదించాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన వినతులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన 'కార్యకర్తే అధినేత' అనే కార్యక్రమం నిర్వహించి, అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కూటమి నాయకులు ఆకిరి ప్రసాద్‌రావు, భూలోక పాల్గొన్నారు.

## పెట్రోల్ కల్తీపై రగడ

భోగాపురం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): తగరపువలసకు చెందిన సీహెచ్ గోపి అనే వ్యక్తి శుక్రవారం తన ద్విచక్రవాహనానికి మండలంలోని ఓ బంకులో పెట్రోల్ కొట్టించారు. కిలోమీటర్ దూరం వెళ్లేసరికి, వాహనం ఆగిపోయింది. మెకానిక్ వద్దకు వెళ్లగా పెట్రోల్ కల్తీ అయ్యిందని గ్రహించారు. వెంటనే తన అనుచరులతో ఆ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి, రగడ చేశారు. పెట్రోల్‌లో నీరు కలిసిందని యాజమాన్యానికి చూపించి, వాగ్వాదానికి దిగారు. బంకు యజమాని దీనికి తమకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారు.

## కల్తీ జరిగితే చర్యలు తప్పవు

చీపురుపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్‌లో కల్తీ జరిపితే, బంకు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.ధర్మరాజు హెచ్చరించారు. పట్టణంలోని పాత పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి జరిగిన ఘటన నేపథ్యంలో అందిన ఫిర్యాదు మేరకు ఆయన శుక్రవారం బంకును తనిఖీ చేశారు. ఈసందర్భంగా బాధితులు సింగారపు రాంబాబు, ఎల్.కిషోర్‌లను ఆయన విచారించారు. ఆయిల్ నాణ్యతపై ఫిర్యాదులొస్తే ఉపేక్షించేది లేదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ, సిబ్బంది ఉన్నారు.

## సదస్సుకు హాజరుకండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని యూనియన్ కార్యాలయ భవనంలో ఈనెల 14న నిర్వహించనున్న ఈపీఎఫ్ పింఛన్‌దారుల సమావేశాన్ని జయప్రదం చేయాలని పలు వామపక్ష సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సీఐటీయూ, సీపీఐ, ఐఎఫ్‌టీయూ, కాంగ్రెస్ పార్టీల నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకాల పద్మనాభం మాట్లాడారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

## మద్యం సీసాల స్వాధీనం

మెంటాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చింతలవలస గ్రామంలో బెల్ట్ షాప్‌పై గజపతినగరం ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం దాడి చేసి, ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరేంద్ర చెప్పారు.

## రాయితీపై నానో యూరియా

కొత్తవలస, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నానో యూరియాను వినియోగించి పంట దిగుబడి పెంచుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం చింతలపాలెంలో ఎస్సీ ఉపప్రణాళికలో భాగంగా 30 మంది రైతులకు 100 శాతం రాయితీతో నానో యూరియాను అందజేశారు. ఏవో కేవీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లోకేశ్ కృషి అభినందనీయం

భోగాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని ఇక్కడకు తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి అభినందనీయమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని లోకేశ్ రాష్ట్రానికి తీసుకొచ్చారన్నారు. గతంలో కూడా ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు సరికాదన్నారు. పార్టీ నాయకులు ఆకిరి ప్రసాదరావు, మైలపల్లి సింహాచలం, భూలోక, అవనాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆదర్శవంతమైన నాయకుడు..

చీపురుపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదర్శవంతమైన నాయకుడని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఆయనకెవరూ సాటి రారన్నారు. నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న వారిని రాష్ట్రానికి రప్పించడంలో లోకేశ్ చూపిన చొరవ సాటి లేనిదన్నారు. గతంలో కూడా కంబోడియాలో చిక్కుకున్న మీసాల ఆదిబాబు అనే తెలుగు నిరుద్యోగిని రాష్ట్రానికి రప్పించడంలో లోకేశ్ చొరవ చూపించారన్నారు.

## చెరువుల కొలతల ప్రక్రియ పూర్తి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెరువుల వాస్తవ విస్తీర్ణ కొలతలు చేపట్టే ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చిందని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో శుక్రవారం బుచ్చెన్నకోనేరు విస్తీర్ణ కొలతలను ప్రణాళిక సిబ్బంది నమోదు చేశారు. మొత్తం 16 మంది ప్రణాళికా కార్యదర్శులు బుచ్చెన్నకోనేరు చెరువుకు కొలతలు తీశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చెరువులు కబ్జా చేయకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

## ఆ అధికారులను సస్పెండ్ చేయాలి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆవు మాంసం అమ్ముకునేందుకు లైసెన్సు మంజూరు చేసిన నగరపాలక సంస్థ అధికారులను సస్పెండ్ చేయాలని గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. నగరంలోని సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చట్టాలను తుంగలో తొక్కి, లైసెన్సు మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. సమాఖ్య ప్రతినిధులు టి.పైడిరాజు, సంధ్యారాణి, తాతారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై దృష్టి సారించండి

జామి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని జడ్పీ సీఈవో బి.సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన జాగరం గ్రామాన్ని సందర్శించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహం కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో సేకరించిన తడి చెత్త, పొడిచెత్తలను వేరుచేయించాలని కార్యదర్శి అనురాధకు సూచించారు. వాటర్‌ట్యాంక్‌ను పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ ఉమ తదితరులు పాల్గొన్నారు.

## సంకిలిలో ఊట చెరువుకు గండి

రేగిడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సంకిలిలో ఊటచెరువుకు శుక్రవారం గండి పడింది. ఇటీవల పడిన భారీ వర్షాలకు గట్టు బలహీనమై ఒక చోట రెండు మీటర్ల మేర కోత పడింది. రైతులు అప్రమత్తమై తాత్కాలికంగా ఈ గండిని పూడ్చారు. వీఆర్వో దుర్గారావు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించారు.

## ఎరువుల కోసం బారులు

సంతకవిటి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులు తీరడం కనిపించింది. ఈ దుకాణానికి 500 బస్తాల యూరియా వచ్చింది. రైతులు బారులు తీరగా, ఒకొక్కరికీ ఒకొక్క బస్తా పంపిణీ చేశారు. ఈ పంపిణీ సజావుగా సాగిందని, ఎరువులు అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని ఏవో సీబీ యశ్వంత్‌రావు తెలిపారు.


యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

## వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయండి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గం అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ఏఎంసీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తొలిసారి ఏఎంసీ కార్యాలయానికి వెళ్లారు. ఈసందర్భంగా పాలకవర్గ ఛైర్మన్ కర్రోతు నర్సింగరావుతో పాటు, వైస్ ఛైర్మన్ చంద్రినాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లంతా ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచి ప్రతిపాదనలతో పాలకవర్గం ముందుకు వస్తే, ప్రభుత్వ పరంగా మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### గాజులరేగ పీఏసీఎస్ చైర్మన్‌గా కోరాడ

గాజులరేగ పీఏసీఎస్ ఛైర్మన్‌గా కోరాడ వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్‌లకు సంబంధించి ప్రభుత్వం త్రీమన్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీలో వెంకటరమణతో పాటు, డైరెక్టర్లుగా బూడి రమేష్, కిలారి సూర్యనారాయణలను నియమించామని చెప్పారు. ఈసందర్భంగా కోరాడ వెంకటరమణ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానన్నారు.


టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అదితి

### వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ఆరో డివిజన్ జమ్ము ప్రాంతానికి చెందిన కోట్ల చంద్రశేఖర్, పిడిది రాజు, ఎ.నాగేంద్ర, దిండి వెంకటరమణతో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరంతా విజయనగరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు గంటా రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ గాజులరేగ పీఏసీఎస్ కార్యాలయంలో జరిగింది. టీడీపీ నగర, మండల నాయకులు పాల్గొన్నారు.

## రసాభాసగా సర్వసభ్య సమావేశం

గరివిడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఈ సమావేశంలో పలువురు పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ మండలంలో రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. దీనిపై ఏవో మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో మరో విడత యూరియా మండలానికి వస్తుందని తెలిపారు. వెదుళ్లవలసలో సబ్‌స్టేషన్‌లో 18 నెలలుగా జీతాలు లేకుండా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న నలుగురు షిఫ్టు ఆపరేటర్లను తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని నియమించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారని సర్పంచ్ తమ్మినాయుడు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వాకాడ శ్రీను, ఇన్‌చార్జి ఎంపీడీవో మధు, తహసీల్దార్ బంగార్రాజు, ఎంఈవో పి.రామారావు, ఐసీడీఎస్ పీవో ఎన్.ఆరుద్ర పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

రాజాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ సోమవారం పాత తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈసందర్భంగా రాజాం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణరావుకు మెమోరాండం అందజేశారు. ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వీఆర్‌కే నాయుడు, బెవర శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

## ఖాతాదారులకు మెరుగైన రుణ సదుపాయాలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాదారులకు, ప్రముఖ వర్తకులకు మెరుగైన రుణ సదుపాయాలు కల్పిస్తామని ఆ బ్యాంకు రీజనల్ మేనేజరు జితేంద్ర శర్మ అన్నారు. శుక్రవారం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా మేళా నిర్వహించారు. ఈ రుణమేళాలో బ్యాంకు మేనేజర్లు పాల్గొని హోటల్ యాజమాన్యాలకు, ప్రముఖ వర్తకులకు వివిధ రుణ సదుపాయాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఆర్ఎం రాజాతో పాటు వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, రీజనల్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.


మెగా మేళాలో పాల్గొన్న బ్యాంకు ఉన్నతాధికారులు

## వెనక్కి వెళ్లిన ఆసుపత్రి అభివృద్ధి నిధులు

భోగాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భోగాపురం సీహెచ్‌సీకి ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి నిధులు వెనక్కు వెళ్లాయి. ఈ ఆసుపత్రికి జూలై 2024 నుంచి జూన్ 2025 వరకు సుమారు రూ.7.95లక్షల అభివృద్ధి నిధులు వచ్చాయి. అయితే వీటిని సకాలంలో ఖర్చు చేయకపోవడంతో సుమారు రూ.6లక్షల నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అంగీకారం తెలపని కారణంగా ఈ నిధులను ఉపయోగించనట్టు తెలుస్తోంది. అభివృద్ధి కమిటీకి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే, కన్వీనర్ మెంబరుగా వైద్యాధికారి, మరో మెంబరుగా మరో వైద్యాధికారి, మరో ముగ్గురు మెంబర్లు ఉంటారు. అయితే కమిటీ సమన్వయ లోపంతో నిధులు ఉపయోగించలేనట్లు తెలుస్తోంది.

● దీనిపై ఆసుపత్రి వైద్యాధికారి వెంకటరమణను వివరణ కోరగా.. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి అనేక అవసరాలు ఉన్నా వచ్చిన నిధులను సమయానుకూలంగా ఉపయోగించలేకపోవడంతో వెనక్కు మళ్లాయని తెలిపారు.

## క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

### ఫుట్‌బాల్ పోటీలకు..

లక్కవరపుకోట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన భూమిరెడ్డి కావ్య, కిలపర్తి లావణ్య, కేపీ రుచిత, సీహెచ్.దేవేంద్ర అనే నలుగురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని త్వరలో విజయవాడలో జరగనున్న పోటీలకు తీసుకెళ్తామని పీడీ పి.శ్రీరాములు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం శివరామకృష్ణ, సిబ్బంది అభినందించారు.

### రాష్ట్ర స్థాయికి..

చీపురుపల్లి: చీపురు పల్లి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి మల్ల ఖంబా పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల పీడీలు వి.ఉషారాణి, ఎస్.అనురాధ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన జె.మేరీగ్రేస్, వి.వర్షిణీ ఈ పోటీలకు ఎంపిక య్యారన్నారు. ఈనెల 10న జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరచి, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు.

### కరాటే పోటీలకు..

కొత్తవలస: కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి కరాటే పోటీల ఎంపిక నిర్వహించారు. జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అండర్-12, అండర్-15, అండర్-19 విభాగాల్లో విద్యార్థులను ఎంపిక చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.శ్రీదేవి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణంరాజు తోపాటు జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

## క్వారీలను తరలించాలి

● మాధవరాయమెట్ట వాసుల నిరసన

జామి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జామి మాధవరాయ మెట్ట వద్ద ఉన్న క్వారీల వివాదం రాజుకుంది. ఇక్కడ ఉన్న క్వారీల వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని అక్కడి కాలనీవాసులు సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకుడు డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు. వీరికి మద్దతుగా ప్రముఖ న్యాయవాది రమణరావు వచ్చి వీరి సమస్యను తహసీల్దార్‌కు తెలియజేశారు. ఇక్కడ ఉన్న క్రషర్ల ధూళి వల్ల పదుల సంఖ్యలో ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారని.. వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడ ఉన్న క్రషర్లను దూరంగా తరలించాలని కోరారు. దీంతో తహసీల్దార్ కృష్ణంరాజు క్వారీ నిర్వాహకులను పిలిపించారు. అనుమతి పత్రాలను చూపించమనగా.. కొన్ని పత్రాలను తెప్పించారు. సోమవారం పూర్తి స్థాయిలో తమ వద్ద ఉన్న పత్రాలను సమర్పిస్తామని చెప్పారు. దీంతో తహసీల్దార్ ఈ వివాదాన్ని వాయిదా వేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పరిస్థితులు గందరగోళంగా మారడంతో ఎస్ఐ వీరజనార్దన్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.


ఆందోళన చేస్తున్న మాధవరాయమెట్ట వాసులు

## మలేరియా మాత్రలు మింగి..

● మహిళ ఆత్మహత్య

కురుపాం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మలేరియా మాత్రలు మింగి ఓ గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఏగులవాడ పంచాయతీ ఈతమానుగూడలో గురువారం రాత్రి జరిగింది. కురుపాం ఎస్ఐ నారాయణరావు అందించిన వివరాల ప్రకారం.. ఈతమానుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ మండంగి సూరమ్మ(30), సురేష్ భార్యాభర్తలు. సురేష్ మద్యానికి బానిస కావడంతో భార్య సూరమ్మ తాగవద్దని మందలించింది. ఈ విషయంలో గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన సూరమ్మ ఇంటిలో ఉన్న 8 మలేరియా మాత్రలు మింగింది. దాంతో ఆమె అపస్మారక స్థితిలోకి చేరింది. సూరమ్మను మొండెంఖల్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూరమ్మ మృతి చెందింది. సూరమ్మకు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు.

## పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

తెర్లాం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించి, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన కేసులో కంకణాల కిరణ్‌కు విజయనగరం పోక్సో కోర్టు న్యాయాధికారి కె.నాగమణి మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారని ఎస్ఐ సాగర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలిక ఈ ఏడాది ఫిబ్రవరిలో చేసిన ఫిర్యాదుపై అప్పట్లో కంకణాల కిరణ్‌పై కేసు నమోదు చేశామన్నారు. కేసు విచారణ పూర్తికావడంతో కిరణ్‌కు న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని ఎస్ఐ తెలిపారు. బాధితురాలికి రూ.25వేలు పరిహారం చెల్లింపునకు న్యాయాధికారి ఆదేశించారని ఎస్ఐ వివరించారు.

## గుళ్లపాడు ఫీల్డ్‌అసిస్టెంట్‌పై పునః విచారణ

రేగిడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుళ్లపాడు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల మంగమ్మను పలు అభియోగాల నేపథ్యంలో సస్పెండ్ చేయగా ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో ఆమెకు మళ్లీ పోస్టింగ్ ఇచ్చారు. ఈక్రమంలో ఈమెపై వచ్చిన అభియోగాలు వాస్తవమో కాదో మరో సారి నిగ్గు తేల్చాలని డ్వామా అధికారులకు కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు శుక్రవారం విజయనగరం క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వై.పద్మజ ఆ గ్రామంలో విచారణ చేశారు. ఉంగరాడమెట్ట యాత కాలనీకి చెందిన 13మంది వేతనదారులకు జాబ్‌కార్డులు జారీ చేయకుండా, గత ఐదేళ్లుగా పని కల్పించకుండా తాత్సారం చేశారని, తప్పుడు మస్టర్లతో నిధులు కాజేశారని ఫిర్యాదుదారు ఏపీడీకి తెలియజేశారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ కలుగజేసుకుని.. రాజకీయ కక్షతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెబుతూ తన వద్ద ఉన్న జాబ్ కార్డులు చూపించారు. దీనికి ఫిర్యాదుదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువర్గాల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి, పీడీకి నివేదిస్తామని ఏపీడీ తెలిపారు. ఈ విచారణలో డ్వామా డీపీటీ మేనేజర్ అసిఫ్, ఏపీవో శ్రీనివాసరావు, జేఈ మురళి, గుళ్లపాడు సర్పంచ్ ప్రతినిధి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో దాడి చేశారంటూ ఫిర్యాదు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో ఒక యువకుడు తనపై ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడిచేశారని, తప్పించుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చానని చేసిన ఫిర్యాదు సంచలనం కలిగించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.కోట పట్టణంలో బాలికోన్నత పాఠశాల పక్కన ఒక యువకుడు టీస్టాల్ నడుపుతున్నాడు. ఈయన శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో తన దుకాణానికి వస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు బైకుపై వచ్చి తనపై కత్తితో దాడి చేశారని, వారి నుంచి తప్పించుకుని వచ్చానని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఈవిషయంపై సీఐ నారాయణమూర్తి మాట్లాడారు. ఈ యువకుడు తనపై చాకుతో దాడి జరిగిందని చెప్పడం, ఆసుపత్రిలో చేరడం, దీనిని వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం, ఆ వీడియోలను మీడియా చానెల్స్‌కు ఇవ్వడం చూస్తుంటే ఇదంతా అనుమానాస్పదంగా కనిపిస్తుందన్నారు. సదరు యువకుడు దేవి గుడి ఎదురుగా పూలు అమ్మే మహిళ వద్ద కొద్దికాలం కిందట బంగారుగొలుసు తీసుకుని తాకట్టు పెట్టాడన్నారు. ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ మహిళ పలుసార్లు పోలీసులకు ఫిర్యాదు కూడా చేసిందన్నారు. ఈ విషయంపై సదరు యువకుడిని పిలిపించి ప్రశ్నిస్తే శుక్రవారం ఆమెకు రూ.లక్షా 20వేలు ఇస్తానని అంగీకరించానని, అందుకే ఆమె తనపై దాడి చేయించిందని చెబుతున్నాడని చెప్పారు. ఈ విషయంపై సదరు యువకుడిని గట్టిగా ప్రశ్నిస్తే వెళ్లిపోయాడన్నారు. బంగారు గొలుసు ఇచ్చిన మహిళ పేదరాలని, మానసికంగా ఇబ్బందుల్లో ఉందని సీఐ చెప్పారు. ఈ ఘటనపై లోతుగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

## పుస్తెలతాడు లాక్కుపోయాడు

వేపాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నీలకంఠరాజపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి ఓ మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుపోయాడు. గ్రామానికి చెందిన నెక్కల వెంకటలక్ష్మి అనే మహిళ పచ్చగడ్డి కోసం పొలానికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా.. అదే రోడ్డులో బైకుపై వస్తున్న ఓ వ్యక్తి ఈ దారిలో వెళ్తే ఏ ఊరు వస్తుందని అడిగాడు. ఆమె సమాధానం చెబుతుండగా.. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును లాక్కొని వెళ్లిపోయాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. వేపాడ లైన్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ ఆ ఆగంతకుడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు.

## ఢిల్లీలో జిందాల్ నిర్వాసితుల ఆందోళన


ఢిల్లీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఢిల్లీ వెళ్లిన జిందాల్ నిర్వాహితులు శుక్రవారం తమ నిరసనను కొనసాగించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్‌తో కలిసి ఆంధ్రాభవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ భూములు వెనక్కి ఇప్పించాలని కోరారు.

### బొడ్డవర వద్ద..

బొడ్డవర గ్రామం వద్ద స్థానికంగా ఉన్న జిందాల్ నిర్వాసితులు 83వ రోజు తమ నిరసనను కొనసాగించారు. జిందాల్ కంపెనీ అల్యూమినియం కంపెనీ ఏర్పాటుపేరుతో 18ఏళ్ల కిందట పరిశ్రమ పెడతామని భూసేకరణ చేశారని అయితే ఎటువంటి పరిశ్రమలు పెట్టని కారణంగా చట్టపరంగా తమ భూములు తమకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

EDUCATION
» Open 10th, Inter అడ్మిషన్ జరుగుచున్నవి. అక్టోబర్ నెలలో ఎగ్జామ్స్. పాస్ గ్యారంటీ. డిగ్రీఫెయిల్ అయిన స్టూడెంట్స్, డిగ్రీ పాస్ అయ్యే అవకాశం కలదు. సంప్ర :7997296796.
AJV_241525

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

## సమస్యలు ఇవిగో!

(5వ పేజీ తరువాయి)

బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాల్సి ఉంది. పార్వతీపురం మండలం హెచ్.కారాడవలస, పెద్ద బండపల్లి ప్రాంతాల మధ్య కూడా గ్రానైట్ తవ్వకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ప్రధానంగా జిల్లావాసులను వేధిస్తున్న ఏనుగుల సమస్యపై దృష్టిసారించాలి. సీతానగరం మండలంలో ఎలిఫెంట్ జోన్ పనులు త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. కుంకిని జిల్లాకు రప్పించి మన్యం వాసులకు ఏనుగుల బెడద తప్పించాలి.
- కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం, వైద్య కళాశాలకు స్థల సేకరణ పూర్తి చేయాలి.
- కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలం అనుకూలంగా లేదని ఇంజనీరింగ్ శాఖాధికారులు స్పష్టం చేసినందున.. దీనిపై కూడా నూతన కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.

## వసతుల కొరత.. చదువులకు అవస్థ

(5వ పేజీ తరువాయి)

కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలు కలిపి మొత్తంగా 34 మంది మాత్రమే ఉన్నారు. 2023-24లో మొత్తం 100 మంది పాలిసెట్ కౌన్సిలింగ్ ద్వారా ఇక్కడ జాయిన్ అయితే 97 మంది తిరిగి వెళ్లిపోయారు. 2024-25లో 124 మంది జాయిన్ అవగా కేవలం 18 మంది మాత్రమే ఇక్కడ ఉండిపోయారు.

**ఇదీ పరిస్థితి..**

చినమేరంగిలో 2005-06లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించారు. మొదట ఈ భవనంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కొనసాగేది. ఆ తరువాత ఇది ప్రీ, పోస్టుమెట్రిక్ హాస్టళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ప్రీమెట్రిక్ విద్యార్థులు 54 మంది, పోస్టుమెట్రిక్ ఇంటర్మీడియట్ విద్యార్థులు 26 మంది, డిప్లొమా విద్యార్థులు 18 మంది ఉన్నారు. అయితే వారికి తాగునీరు అందుబాటులో లేదు. సమీపంలో ఉన్న ఎస్సీ వసతి గృహం నుంచి తాగడానికి నీరు తీసుకోవాల్సి వస్తోంది. వంటలకు పక్కనే ఉన్న నేలబావి నుంచే నీరు తెస్తున్నారు. రన్నింగ్ వాటర్ లేక మరుగుదొడ్లు, స్నానాల గదులు ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ హాస్టల్‌లో గచ్చులూడిపోయిన నేలపై వారు పడుకోవాల్సిన దుస్థితి. రూముకు బల్బు, ఒక ఫ్యాన్ మాత్రమే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక స్థానికులు ఇష్టాను సారంగా ఆవులు, గేదెలు కట్టడంతో వసతి గృహం ప్రాంగణం అధ్వానంగా మారింది.

## పోలీసులకు ఈ-దార్‌పై శిక్షణ

జియ్యమ్మవలస, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి సర్కిల్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ డీటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈ-దార్) యాప్‌పై గుమ్మలక్ష్మీపురం, చినమేరంగి సర్కిల్ కార్యాలయాల పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ-దార్ జిల్లా సమన్వయకర్త శ్రీధర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన ఒక పోర్టల్ ఇదన్నారు. ఈ పోర్టల్ రోడ్డు ప్రమాదాల సమగ్ర సమాచారం అందించడంతో పాటు ప్రమాద పరిహారాల క్లయిములను వేగవంతం చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాద బాధితులకు సత్వర న్యాయం అందించడంలో ముఖ్యమైన సాధనంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో చినమేరంగి, ఎల్విన్‌పేట సర్కిల్స్ సీఐలు టీవీ తిరుపతిరావు, బి.హరితో పాటు గరుగుబిల్లి, జియ్యమ్మవలస, చినమేరంగి, కురుపాం, ఎల్విన్‌పేట, నీలకంఠాపురం ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## వీరఘట్టంలో భారీ వర్షం



వండువ సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వీరఘట్టం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. పంట పొలాల్లో నీరు చేరడంతో పాటు పాలకొండ, వీరఘట్టం ప్రధాన రహదారిపై యు.వెంకంపేట, తూడి, వండువ సెంటర్ వద్ద రోడ్డుపై వరదనీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలుకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

## పోషకాహారంపై అవగాహన




పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో శుక్రవారం మహిళలకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో కేవీకే రస్తా కుంటుబాయి, ఐసీడీఎస్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్ర గృహ నిర్మాణ శాస్త్రవేత్త ఉమాజ్యోతి, ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ అధికారి ఉషారాణి మహిళలు, పిల్లల్లో రక్తహీనత, కాల్షియం లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మహిళలకు ఆకుకూరల విత్తనాల కిట్స్‌ను అందించారు. ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, మహిళా సంఘాల వీవో అధ్యక్షురాలు రాజేశ్వరి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీడీ 4.0 సర్వేకు సిద్ధంకండి

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ స్ర్కీనింగ్ ప్రధాన లక్ష్యంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 4.0 సర్వేకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలకు క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై ఎన్జీవో హోంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. కార్య క్రమంలో డీపీఎంవో డాక్టర్ పి.ఎల్.రఘుకుమార్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ సూర్యకౌశిక్, తాజ్ తదితరుల పాల్గొన్నారు.

## వెబ్‌సైట్‌లో భూమి నమోదు చేయండి

భామిని, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే తర్వాత సర్వే నెంబరు 52-1లోని భూముల వివరాలు వెబ్‌సైట్‌లో చూపించడం లేదని సింగిడి గ్రామానికి చెందిన దళిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తహసీల్దార్ ఎన్.శివన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజేష్, ఆర్‌ఐ మణి ప్రభ, రైతులు గణపతి, సంజీవరావు పాల్గొన్నారు.

## స్వమిత్వ సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన గడువులోగా స్వమిత్వ సర్వే వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కె.కుమారవర్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు స్వమిత్వ సర్వే నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 పంచాయతీల్లో జరుగుతున్న స్వమిత్వ సర్వే వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, చెత్త నుంచి సంపద తయారు విషయాలపై ఆయన చర్చించారు.

# రాకపోకలకు ప్రహరీ అడ్డంకి

### ● ఇబ్బంది పడుతున్న 14వ వార్డు ప్రజలు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా స్వేచ్ఛగా రాకపోకలు సాగించే పట్టణంలోని 14వ వార్డు ప్రజలకు రైల్వే అధికారులు నిర్మాణం చేపట్టిన ప్రహరీ వల్ల కష్టాలు ఎదురయ్యాయి. పట్టణంలోని 14వ వార్డు గాంధీ నగర్, గొల్లవీధులు సుమారు పార్వతీపురం మున్సిపాల్టీ ఏర్పడిన నాటినుంచి ఉన్నాయి. అయితే పార్వతీపురం రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో గాంధీనగర్, గొల్లవీధి చుట్టూ రైల్వే ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దాంతో స్థానికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. స్వేచ్ఛగా రాకపోకలు సాగించలేకపోతున్నారు. పార్వతీపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే 15 నిమిషాల్లో వెళ్లేవారమని, ప్రహరీ నిర్మాణం వల్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, దాదాపు 25 నిమిషాలు పడుతోందని ఆయా వీధుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మాణం చేపడుతున్న నాటి నుంచి రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న ఫలితం లేకుందని వారంటున్నారు. ఇకనైనా సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.



గాంధీనగర్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో నిర్మించిన ప్రహరీ

## లోకేశ్ కృషి ప్రశంసనీయం

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేరవేయడంలో మంత్రి లోకేశ్ చేసిన కృషి ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కొనియాడారు. ఆమె నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేపాల్‌లో తెలుగువారు చిక్కుకున్నట్టు సమాచారం అందిన వెంటనే అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని అమరావతి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారన్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. 215 మంది తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించడంలో లోకేశ్ పాత్ర ఎనలేనిదన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన జేసీ

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాగా విధులు నిర్వహిస్తూ సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జేసీకి సూచించారు.

**కలెక్టర్‌కు సత్కారం**

●గరుగుబిల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు బదిలీ అయిన నేపథ్యంలో టీడీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.పురుషోత్తంనాయుడు, అరకు టీడీపీ అధికార ప్రతినిధి డి.రామకృష్ణ, నీటి సంఘం చైర్మన్ ఎం.సత్యంనాయుడు, పి.వెంకటనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలతో మమేకమై మన్యం జిల్లా అభివృద్ధికి శ్యామ్‌ప్రసాద్ కృషి చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని కొనియాడారు.

## గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంప్‌లు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంప్‌లు నిర్వహించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం మొబైల్ ఆధార్ క్యాంప్‌ల నిర్వాహకుల శిక్షణను ఉద్దేశించి పీవో పలు సూచనలు చేశారు. ఆధార్ కార్డులో సవరణల కోసం గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను గుర్తించి మొబైల్ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు పాల్గొన్నారు.

## కామయ్యబందను పరిశీలన

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని కామయ్య బందను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి కామయ్య బంద విస్తీర్ణంపై ఆరా తీశారు. సంబంధిత మ్యాప్‌ను మ్యాప్‌ను పరిశీలించారు. కామయ్య బంద చుట్టూ నివాసాలు, వాణిజ్య కట్టడాలపై సబ్ కలెక్టర్ రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బైపాస్ రహదారిలోని వరహాల గెడ్డను పరిశీలించి, పరివాహక ప్రాంతానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలోని వరహాల గెడ్డ వరద ఉధృతి వల్ల లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు ముంపునకు గురవుతున్నాయా, లేదా అని ఆరా తీశారు.

## సీపీఎస్‌ను రద్దు చేయండి

పాలకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం డీటీ నాగేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వి.రమణ, గౌరవ అధ్యక్షుడు టంకాల ఉమామహేశ్వరరావు, జిల్లా కౌన్సెలర్ నాగరాజు తదితరులున్నారు.

●వీరఘట్టం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సాయి కామేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లోని నాలుగు డీఏలను వెంటనే ఇప్పించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. పీఆర్‌సీ కమిషన్‌ను వేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

●గరుగుబిల్లి, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మర్రాపు మహేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు టి.సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.రాజశేఖర్, ఉపాధ్యక్షులు జె.లక్ష్మి, ఐవీ రమణ, కె.జగన్మోహనరావు, జి.శ్రీనివాసరావు, ఎ.శ్రీరామ్మూర్తి, వి.తిరుపతిరావు, బి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మండల సమావేశం

సీతానగరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బలగ రమణమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. మండలంలోని పలు సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ ఏఈ శశిభూషణరావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సోలార్ పవర్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కుమారవర్మ, తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఏపీవో బాలకృష్ణ, వైద్యాధికారులు ఉషారాణి, రమ్య పాల్గొన్నారు.

## పాలకొండలో శిక్షణ తరగతులు

పాలకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి స్నేహపూర్వక మహిళా పంచాయతీరాజ్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎంపీపీ బొమ్మాళి భాను ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. నైపుణ్యత సాధించాలన్నారు. తద్వారా కుటుంబ అభివృద్ధికి, గ్రామాలాభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందుకు సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు, ఈవోపీఆర్‌డీ, సర్పంచ్‌లు, సెక్రటరీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## పొట్లి, నవగాం కాజ్‌వేపై వరదనీరు

### ●స్తంభించిన రాకపోకలు



కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

పాలకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నవగాం, పొట్లి గ్రామాల మధ్య రావాడ గెడ్డ కాజ్‌వే మీదుగా వరదనీరు ప్రవహిస్తోంది. దీనితో పొట్లి, డోలమడ, ఆర్‌బిఆర్‌పేట, నవగాం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గంటల సేపు కాజ్‌వేపై ఉధృతంగా వరదనీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడం కష్టమైంది. శుక్రవారం రాత్రికి కాజ్‌వేపై నీరు తగ్గడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు సాగాయి. అలాగే మండలంలోని ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఓనిగెడ్డ, జంపరకోటగెడ్డ, ఒట్టిగెడ్డ తదితర గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీనితో మండలంలో తంపటాపల్లి, గొట్ట మంగళాపురం, చిన్నమంగళాపురం, వీపీరాజుపేట, పాలకొండ, తుమరాడ గ్రామానికి చెందిన లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు నీటమునిగాయి.

## శతశాతం బయో గ్రామాలుగా తీర్చిదిద్దండి



మాట్లాడుతున్న డాక్టర్ పారినాయుడు

గరుగుబిల్లి, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో శతశాతం గ్రామాలను బయో గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రైతు సాధికార సంస్థ సీనియర్ అభివృద్ధి కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు సూచించారు. శుక్రవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఉత్తర కోస్తా బయో గ్రామాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో 500 గ్రామాలను శతశాతం ప్రకృతి వ్యవసాయ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆరోగ్య పరిరక్షణ, పంటల దిగుబడులు, ఆదాయ వనరులు పెంపొందించేందుకు ప్రకృతి విధానాలను అవలంబించాలన్నారు. ఇందుకు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విజయ్‌కుమార్ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఉత్తరాంధ్ర ప్రకృతి వ్యవసాయ ప్రాంతంగా గుర్తించేందుకు సహకారించాలన్నారు. సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ కె.ప్రకాశ్, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు, సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, ఎన్‌ఎఫ్‌ఏ జి.అన్నపూర్ణ, సిబ్బంది ఎం.నూకంనాయుడు, ప్రబోద్, మురళీమోహన్, సునీల్ పాల్గొన్నారు.

## కాలువకు గండి

గరుగుబిల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉల్లిభద్ర ప్రాంతంలోని జంఝావతి కాలువకు శుక్రవారం గండి పడింది. కాలువకు గండి పడటంతో ప్రాజెక్టు జేఈ పత్తిక పవన్‌కుమార్ గండి ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే గ్రామానికి చెందిన పలువురు రైతులు అనధికారికంగా మదుములు ఏర్పాటు చేయడంతో పాటు వర్షాల వల్ల గండి పడందన్నారు. రైతులకు ఇబ్బంది కలగనీయకుండా గండిని పూడ్చే పనులు చేపడుతున్నామని జేఈ తెలిపారు. గండి పడిన ప్రాంతాన్ని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.తవిటినాయుడు, మండల నాయకులు ప్రతినిధి ఎం.నారాయణస్వామి, వెంకటనాయుడుతో పాటు పలువురు రైతులు పరిశీలించారు.

## విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పాలకొండ, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): సిరికొండ, వెలగవాడ, రుద్రిపేట, ఎన్.కె.రాజపురం, సింగన్నవలస ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. పాలకొండ ఏరియా ఆసుపత్రి కంటి వైద్య నిపుణుడు లక్ష్మణరావు సుమారు 120 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు.

## కళాఉత్సవ్‌లో మెరిసిన మామిడిపల్లి విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సాలూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరం డైట్‌లో శుక్రవారం నిర్వహించిన కళాఉత్సవ్-2025లో మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెరిశారు. ఓ సమాజమా... మేలుకో అనే నాటక ప్రదర్శనలో ప్రథమ బహుమతిని సాధించారు. నాటికలో జి.చరిష్మా, బి.ఉదయశ్రీ, పి.మౌనిక, ఎన్.ఇందు ప్రతిభను చాటుకున్నారు. కథాకథనంలో జి.గ్రీష్మ, ఎ.రేణుక ద్వితీయ బహుమతి, బొమ్మల తయారీలో ఆర్.లీలాప్రసాద్ మూడో బహుమతిని గెలుచుకున్నారు. వీరికి గైడ్ టీచర్‌గా ఇ.జానకి వ్యవహరించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

## టిమ్‌లో సాంకేతిక లోపం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు టిక్కెట్లు జారీచేసే యంత్రం (టిమ్)లో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతం లో పార్వతీపురం నుంచి సాలూరు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో టిమ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో బస్సును ప్రధాన రహదారిలోని కోర్టు ఎదుట ఆపేశారు. సుమారు అరగంట సేపు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మణరావును వివరణ కోరగా టిమ్‌లు పంపిణీ చేసి మూడేళ్లు కావస్తుండడం వల్ల సాంకేతిక సమస్యలు వస్తున్నాయన్నారు.

## డీఐపీఆర్‌వోగా బాలమాన్‌సింగ్

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకుడు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా క్షత్రి బాలమాన్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకూ డీపీఆర్‌వోగా వ్యవహరించిన ఎల్.రమేష్ పదోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## సారాతో ఇద్దరు అరెస్టు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దోనుబాయి పరిసర గ్రామాల్లో పోలీసులు శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు దోనుబాయి ఎస్‌ఐ మస్తాన్ తెలిపారు. రాయిలంక, దుగ్గి గ్రామాల పరిసరాల్లో కె రమేష్, ఆరిక యానత్ 2 లీటర సారా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

## డయల్ యువర్ డీపీటీవోకు 26 వినతులు

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ప్రజా రవాణా అధికారి కార్యక్రమానికి 26 వినతులు అందాయి. విశాఖపట్నం-పార్వతీపురం చివరి బస్సు సర్వీసు పార్వతీపురం టౌన్‌లోకి వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని పార్వతీపురానికి చెందిన వి.శ్రీహరి కోరారు. పార్వతీపురం నుంచి పెద్దబుడ్డికి బస్సు సౌకర్యం కల్పించాలని పెద్దబుడ్డి గ్రామానికి చెందిన ఆర్.రాజు కోరారు. మక్కువ నుంచి విశాఖపట్నం, దుగ్గేరు, బొబ్బిలి గ్రామాలకు బస్సు కల్పించాలని దుగ్గేరు నుంచి బి.రామకృష్ణ, కె.సీతారాం కోరారు. పాలకొండ నుంచి గుమ్మలక్ష్మీపురం వయా వీరఘట్టం, జియ్యమ్మవలస మీదుగా బస్సు సౌకర్యం, పాలకొండ-కురుపాం గ్రామాలకు మరొక బస్సు సర్వీసును పెంచాలని వీరఘట్టం నుంచి ఎస్.లక్ష్మీనాయుడు విన్నవించారు. బొబ్బిలి బస్సు స్టేషన్‌లో టాయిలెట్ చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే సాలూరు, బొబ్బిలి కాంప్లెక్స్‌లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు. చీపురుపల్లి, పార్వతీపురం మధ్య బస్సు సౌకర్యం కల్పించాలని, అలాగే విశాఖపట్నం-జైపూర్ వయా అలమండ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు డయల్ యువర్ డీపీటీవోకు ఫిర్యాదులు చేశారు.

### ప్రకటన

మ:రా:శ్రీ: సాలూరు జూనియర్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
EP 44/24 OS 13/23

Between:-
శ్రీ కర్రి వెంకటరెడ్డి .....DHR
And:
శ్రీమతి మాకుల కుమారి .....JDR

పై నెంబరు దావా డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం JDR తాలూకా యీ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి అయిన దాబాయిల్లు వేలం ఆస్తి యారుకు లోబడి పై కోర్టులో తే.15.10.2025దీని ఉ॥10.30ని॥ల నుండి సా॥ 5.00గం॥ల మధ్యకాలంలో బహిరంగంగా వేలం జరుగును. గాన వేలము వారు పాడుకొనవచ్చునని యిందు మూలంగా తెలియ జేయడమైనది. యిస్తి యారు చూసి తక్కిన భోగట్టా తెలుసుకొనవచ్చును.

**షెడ్యూలు వివరం:** Dist: Vizianagaram, Municipality - Salur, Village - Salur, Row: Northern Row of Sivalayam Road, Ward No.9(old), 5(new), T.S.No: 159-2 part, Survey No. 418/2A part, Street: Kota veedhi, Locality: Sivalayam Road, Door No:27-98-5, Assessment No: 1092012924, Nature of the property: Terraced House.

**Measurements:** East to West: 11feet or 3.35mts, North to South: 20feet or 6.1mts, Total: 24.44Sq.yards or 20.43Sq.maters

**Boundaries: East:** Terraced House of Paradhi Venkata Rao, **South:** Rastha, **West:** Vacant site of Chukka Kondamma, **North:** Vacant site of Mokara Sankara Rao

Value of the Plaintiff is: Rs.5,00,00
Amain value is: Rs 10,00,000/-
JDR Value is Not Furnished: Nill

స్థిరాస్తి వేలం యిస్తియారు షరతులకు లోబడి వేలం కాబడును.

సాలూరు
తేది. 12.09.2025

శ్రీ రేగు సూర్యనారాయణ,
డిక్రీ హోల్డర్ తరుపున న్యాయవాది
సెల్: 7382071863

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా
పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా
ఈ నెంబర్లకు సంప్రదించండి
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం: 9985403095, సాలూరు: 9492900300

# పురపాలక సంఘ ఉపాధ్యక్షురాలిపై అవిశ్వాస తీర్మానం

ఒడిశా

రాయగడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం ఉపాధ్యక్షురాలు శుభ్రపండాపై 19 మంది కార్పొరేటర్లు శుక్రవారం అవిశ్వాస తీర్మానానికి నిర్ణయించారు. కలెక్టర్ అశుతోష్ కులకర్ణిని కలిసి సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ... పురపాలక సంఘం ఉపాధ్యక్షురాలు తన సొంత నిర్ణయాలను కౌన్సిల్‌పై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లకు మాటకు ఇవ్వాల్సిన కనీస మర్యాదను ఇవ్వడం లేదన్నారు. ఇటీవల బిజూ జనతాదళ్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. పాత్రికేయుల సమావేశంలో తానెందుకు పార్టీకి రాజీనామా చేశానో వివరించడంతో పాటు బిజు స్వాభిమాన్ మంచ్ సామాజిక సేవా సంస్థను ఏర్పాటు చేసి లోగోను ఆవిష్కరించారు. దీంతో జిల్లాలో బిజూ జనతా దళ్ రెండుగా చీలిపోయిందని పలువురు అభిప్రాయం వ్యకం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బిజద జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జగన్నాథ సరక పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి భాస్కరరావు రాజీనామాకు సంబంధించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి శుభ్రపండా హాజరు కావడంతో ఆమె అవిశ్వాస తీర్మానం ఎదుర్కొనాల్సి వచ్చిందని పలువురు అంటున్నారు.

